తెలుగు దినపత్రిక

# సిద్ధిపేట పవర్

ప్రతిక్షణం ప్రజల పక్షం

విలేకరులు కావలెను

తెలుగు రాష్ట్రాల నుండి విడుదలవుతున్న

సంచలన సమాచార దినపత్రిక 'సిద్ధిపేట పవర్' తెలుగు దినపత్రికలో

పనిచేయుటకు అన్ని జిల్లాల వారిగా స్టాఫ్ రిపోర్టర్ లు ఆర్సి ఇంచార్జ్ లు కావలెను

ఆసక్తి ఉన్నవారు వెంటనే సంప్రదించండి

ఫోన్: 9866338848

www.siddipetpower.com

శుక్రవారం 21-03-2025 ఎడిటర్ : తుక్కోజు గణేష్ బాబు సంపుటి 01 సంచిక 61 వెల : 06 రూ

# హరీష్‌రావుకు భారీ ఊరట..

# కేసు కొట్టివేత




హైదరాబాద్, మార్చి 20: రాష్ట్రంలో సంచలనం సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ కేసులో మాజీ మంత్రి హరీష్ రావు,మాజీ డీసీపీ రాధాకిషన్ రావుకు తెలంగాణ హైకోర్టులో ఊరట లభించింది. ఫోన్‌టాపింగ్ కేసులో ఎఫ్ఐఆర్‌ను న్యాయస్థానం కొట్టివేసింది. పంజాగుట్ట పోలీస్‌స్టేషన్‌లో ఫోన్ టాపింగ్ కేసు నమోదు అయ్యింది. రియల్ ఎస్టేట్ వ్యాపారి చక్రధర్ గౌడ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు పోలీసులు. మాజీ మంత్రి హరీష్‌రావు, మాజీ డీసీప రాధాకిషన్ రావులను నిందితులుగా చేర్చారు. ఈ కేసులో ఇప్పటికే వాదనలు ముగియగా.గురువారం హైకోర్టు తీర్పు వెలువరించింది. ఫోన్ ట్యాపింగ్ కేసును కొట్టివేస్తూ హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది.ఫోన్ ట్యాపింగ్ కేసుకు సంబంధించి రెండు ఎఫ్ఐఆర్‌లు నమోదు అయిన విషయం తెలిసిందే. పంజాగుట్ట పీఎస్‌లో నమోదైన రెండో ఎఫ్ఐఆర్‌ను క్వాష్ చేయాలంటూ తెలంగాణ హైకోర్టులో హరీష్ రావు, రాధాకిషన్‌రావు వేసిన పిటిషన్‌పై సుదీర్ఘంగా వాదనలు జరిగాయి. ఈ క్రమంలో రియల్ ఎస్టేట్ వ్యాపారి చక్రధర్ గౌడ్ ఇచ్చిన ఫిర్యాదుపై పంజాగుట్ట పోలీసులు చేసిన ఎఫ్ఐఆర్‌ను క్వాష్ చేస్తూ న్యాయస్థానం కీలక నిర్ణయం తీసుకుంది. ఈ ఎఫ్ఐఆర్‌లో హరీష్‌రావుతో పాటు రాధాకిషన్‌రావును నిందితులుగా చేర్చారు. ఇప్పటికే ఇరు వాదనలు పూర్తవడంతో తీర్పును వెలువరించింది న్యాయస్థానం. ఇద్దరిపై నమోదైన ఎఫ్ఐఆర్‌ను కొట్టివేస్తూ తెలంగాణ హైకోర్టు కీలక తీర్పును వెల్లడించింది. అధికారంలో ఉన్న సమయంలో తన ఫోన్‌ను ట్యాప్ చేసి.తనను ఇబ్బందులకు గురిచేశారని.. వారి వల్ల తనకు ప్రాణహానీ ఉందంటూ రియల్‌ఎస్టేట్ వ్యాపారి చక్రధర్ గౌడ్ కొంతకాలం క్రితం మీడియాతో మాట్లాడారు. చక్రధర్ ఇచ్చిన సమాచారం, ఆయన ఇచ్చిన ఎవిడెన్స్‌ను ఆధారంగా చేసుకుని పంజాగుట్ట పోలీసులు కేసు నమోదు చేశారు. కానీ అందులో సరైన ఆధారాలు లేవని హరీష్ రావు తరపు న్యాయవాది వాదనలు వినిపించారు.హరీష్‌రావు, రాధాకిషన్ వాదనలతో ఏకభవించిన హైకోర్టు. పంజాగుట్టలో నమోదైన ఎఫ్ఐఆర్‌ను కొట్టివేస్తూ తీర్పు ఇచ్చింది.

# ముఖ్యమంత్రి పదవి కంటే జెడ్పీటీసీగా గెలిచినప్పుడే ఆనందం కలిగింది

- మొదటిసారి వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్న ముఖ్యమంత్రి
- తెలంగాణ ఉద్యమంలో నిరుద్యోగుల పాత్ర మరువలేనిదన్న రేవంత్ రెడ్డి
- నిరుద్యోగులను నిర్లక్ష్యం చేయడం వల్లే బీఆర్ఎస్ ఓడిపోయిందని వ్యాఖ్య



ముఖ్యమంత్రి పదవిని చేపట్టడం కంటే జెడ్పీటీసీగా గెలిచినప్పుడే తనకు ఎక్కువ ఆనందం కలిగిందని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. మొదటిసారి వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో 'ప్రజాపాలనలో కొలువుల పండుగ' కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. కారుణ్య నియామకాలు క్రమం తప్పకుండా చేపట్టాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని ఆయన స్పష్టం చేశారు.కారుణ్య నియామకాలు చేపట్టకపోవడం వల్ల చాలామంది పదేళ్లు నష్టపోయారని ఆయన విమర్శించారు. జాబ్ క్యాలెండర్‌తో పాటు కారుణ్య నియామకాలు కూడా ఇవ్వాల్సిందేనని ఆయన అన్నారు. తెలంగాణ ఉద్యమంలో నిరుద్యోగుల పాత్ర మరువలేనిదని ఆయన గుర్తు చేశారు. స్వరాష్ట్రం వచ్చినా నిరుద్యోగుల కల నెరవేరలేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. పేదలు, బడుగుబలహీన వర్గాల వారే పోటీ పరీక్షలకు సిద్ధమవుతారని ఆయన అన్నారు. నిరుద్యోగుల బాధలను ప్రజా ప్రభుత్వం గుర్తించిందని ముఖ్యమంత్రి వ్యాఖ్యానించారు. అందుకే ఏడాదిలో 59 వేల ఉద్యోగాలను ఇచ్చామని తెలిపారు. నిరుద్యోగులను నిర్లక్ష్యం చేయడం వల్లే గత ఎన్నికల్లో బీఆర్ఎస్ ఓడిపోయిందని ఆయన అన్నారు. ఉద్యోగాలు ఇవ్వని వారికి ఓట్లు, ఉద్యోగాలు ఎందుకని యువత బీఆర్ఎస్‌ను ఓడించిందని అన్నారు. నిరుద్యోగుల బాధలు తనకు తెలుసని ఆయన అన్నారు. ఉద్యోగ ఖాళీలను పెండింగ్‌లో ఉంచవద్దని ఆదేశించినట్లు చెప్పారు. పరీక్షలు నిర్వహించి నెలల వ్యవధిలోనే ఫలితాలు వెల్లడించామని ఆయన అన్నారు.

# నేడు, రేపు తెలంగాణలో వర్షాలు



ద్రోణి కారణంగా రాగల రెండు రోజుల్లో తెలంగాణ రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ శాఖ తెలిపింది. ముఖ్యంగా ఉత్తర, ఈశాన్య తెలంగాణ జిల్లాల్లో రేపు, ఎల్లుండి ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురుస్తాయని తెలిపింది. అంతేకాకుండా కొన్ని ప్రాంతాల్లో వడగళ్ల వాన కూడా పడే అవకాశం ఉందని హెచ్చరించింది. గంటకు 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో గాలులు వీస్తాయని పేర్కొంది. ఈ ద్రోణి ప్రభావం వల్ల రాష్ట్రంలో ఉష్ణోగ్రతలు రెండు డిగ్రీల వరకు తగ్గొచ్చని వాతావరణ శాఖ అంచనా వేసింది.

# కేసీఆర్ క్యాంపు కార్యాలయానికి టులెట్ బోర్డు




మాజీ సీఎం కేసీఆర్‌కు తన సొంత నియోజకవర్గం గజ్వేల్‌లో బీజేపీ, కాంగ్రెస్ శ్రేణులు షాకిచ్చాయి. గజ్వేల్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి బీజేపీ నాయకులు బుధవారం టులెట్ బోర్డు పెట్టారు. గజ్వేల్ ఎమ్మెల్యే అయిన మాజీ సీఎం కేసీఆర్ నియోజకవర్గానికి రాకపోవడంపై వాంటెడ్ ఎమ్మెల్యే అంటూ నిరసన వ్యక్తం చేశారు. ఎన్నికల్లో గెలిచి 15 నెలలైనా కేసీఆర్ ఒక్కసారి కూడా గజ్వేల్ వైపు చూడలేదని బీజేపీ శ్రేణులు ఈ సందర్భంగా అన్నారు. ప్రజలకు వద్దకు రాని కేసీఆర్ ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. మరోపక్క, గజ్వేల్ ఎమ్మెల్యే కేసీఆర్ కనబడటం లేదంటూ గజ్వేల్, గౌరారం పోలీసుస్టేషన్లలో యూత్ కాంగ్రెస్ నేతలు వేర్వేరుగా ఫిర్యాదులు చేశారు. కాగా, బీజేపీ నేతల నిరసనపై గజ్వేల్ నియోజకవర్గ బీఆర్ఎస్ ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్ రెడ్డి ఫైరయ్యారు. అల్లరిమూకలు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం తాళాలు పగలుగొట్టి కేసీఆర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేశాయంటూ గజ్వేల్ పోలీస్ స్టేషన్‌లో బీజేపీ నాయకులపై ఫిర్యాదు చేశారు.

# డిసెంబర్ వరకు పార్టీ బలోపేతం... వచ్చే ఏడాది నుండి పాదయాత్ర

- ప్రస్తుతం జిల్లాల పర్యటనలలో ఉన్నానన్న కేటీఆర్
- బీఆర్ఎస్ కార్యక్రమాలకు అద్భుత స్పందన వస్తోందన్న కేటీఆర్
- ప్రజల కోసం బీఆర్ఎస్‌కు అధికారం ఖాయమన్న కేటీఆర్



నవజనజ్యోతి మార్చి 20: వచ్చే ఏడాది నుంచి పాదయాత్ర చేస్తానని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వెల్లడించారు. పార్టీని అధికారంలోకి తీసుకురావడమే లక్ష్యంగా పాదయాత్ర చేపట్టనున్నట్లు ఆయన తెలిపారు. ప్రస్తుతం తాను జిల్లాల పర్యటనలను ప్రారంభించానని, డిసెంబర్ వరకు పార్టీని బలోపేతం చేసే కార్యక్రమాల్లో ఉంటానని పేర్కొన్నారు.బీఆర్ఎస్ కార్యక్రమాలకు అద్భుత స్పందన వస్తోందని అన్నారు. రాబోయే ఎన్నికల్లో బీఆర్ఎస్ అధికారంలోకి రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పాలనను అంతం చేయాలని, ప్రజల కోసం బీఆర్ఎస్‌కు అధికారం అవసరమని ఆయన స్పష్టం చేశారు. ఉద్యమాలు, పోరాటాలు, అధికారం, ప్రతిపక్ష పాత్ర బీఆర్ఎస్‌కు కొత్తేమీ కాదని అన్నారు.కాంగ్రెస్ అరాచక పాలనను అంతం చేయడానికి బీఆర్ఎస్ పార్టీ మళ్లీ అధికారంలోకి రావడం చారిత్రక అవసరమని కేటీఆర్ అన్నారు. బీఆర్ఎస్ ఫినిక్స్ పక్షిలా పైకి ఎగురుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

# ఎమ్మెల్యేల పెర్ఫార్మెన్స్ అదుర్స్!

- పవన్ సినిమాల్లో కూడా ఇంత వినోదం ఉండదేమో...
- విజయవాడలో ఎమ్మెల్యేల సాంస్కృతి కార్యక్రమాలు
- హాజరైన సీఎం చంద్రబాబు
- ఎమ్మెల్యేల టాలెంట్ కు ఫిదా



విజయవాడలో జరిగిన ఎమ్మెల్యేల సాంస్కృతి కార్యక్రమాల ఈవెంట్ కు సీఎం చంద్రబాబు హాజరయ్యారు. ఈ సందర్భంగా శాసనసభ్యులు ప్రదర్శించిన కామెడీ స్కిట్లు, నాటికలు, ఏకపాత్రాభినయాలను చంద్రబాబు హాయిగా ఎంజాయ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆయన ప్రసంగిస్తూ... పవన్ కల్యాణ్ సినిమాల్లో కూడా ఇంత ఎంటర్టయిన్మెంట్ ఉండదేమో... ఎమ్మెల్యేల ప్రదర్శనలు అదుర్స్ అంటూ కితాబిచ్చారు. "అయ్యన్న పాత్రుడు మామూలుగానే ఎంతో హుషారుగా ఉంటాడు... కానీ ఈరోజు ఎక్స్ ట్రా ఎనర్జిటిక్ గా కనపడుతున్నాడు. చాలా ఉత్సాహంగా ఉన్నాడు... ఆయనలో ఒక సంతృప్తి కనిపిస్తోంది. శాసనసభ్యులకు ఇలాంటి క్రీడా పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి మంచి పని చేశారు. ఇక రఘురామకృష్ణరాజు గారు... ఎన్టీఆర్ డైలాగ్స్ చెప్పడంలో ఎక్కడా రాజీపడలేదు. రఘురామకృష్ణ గారు గారు చాలా బ్యూటిఫుల్ గా చాలా నిండుగా చెప్పగలిగారు... ఆయనను చూసినప్పుడు మళ్ళీ ఎన్టీ రామారావు గారు గుర్తొచ్చారు. ఇంతవరకు నా జీవితంలో చాలా ఈవెంట్స్ చూశాను. 45 సంవత్సరాలుగా చాలా కార్యక్రమాలు చేశాం. మన నాయకుడు ఎన్టీ రామారావు గారు ఉన్నప్పుడు కూడా చేశాం. నేను ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు కూడా చేశాను కానీ. గురువారం మీ టాలెంట్ చూసిన తర్వాత ఎక్స్ ట్రార్డినరీ పెర్ఫార్మెన్స్ అనిపించింది. మీకు ఇన్ని టాలెంట్స్ ఉన్నాయన్న విషయం నాకు తెలియదు. మతిపోయింది. మా విష్ణు కుమార్ రాజు గారు జీవించేశారు. విజయ్ కుమార్, ఈశ్వరరావు స్కిట్ చూసి ఎంతో ఆస్వాదించాను. ఇంత ఇదిగా నేను ఎప్పుడూ నవ్వలేదు. నవ్వు ఆపుకోలేకపోయాను. కంట్రోల్ చేయడం కూడా నా వల్ల కాలేదు. అద్భుతంగా చేశారు. మీ ఇద్దరికి మనస్ఫూర్తిగా అభినందనలు" అంటూ చంద్రబాబు కొనియాడారు.

# కేటీఆర్‌కు రాజకీయ ఓనమాలు తెలియవు..

- రేవంత్ రెడ్డి అంచెలంచెలుగా ఎదిగారు
- కేటీఆర్‌కు ఏ అర్హత లేదని, తండ్రి చాటు బిడ్డ అని ఎద్దేవా
- సోనియా, రాహుల్ గాంధీ పేర్లను ఎత్తే అర్హత లేదన్న మంత్రి
- అందరికీ ఫలాలు అందించేలా బడ్జెట్ ఉందన్న కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి



కేసీఆర్ కొడుకు అని తప్ప కేటీఆర్‌కు రాజకీయ ఓనమాలు కూడా తెలియవని, కానీ రేవంత్ రెడ్డి మాత్రం అంచెలంచెలుగా ఎదిగారని తెలంగాణ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అన్నారు. ఆయన మీడియాతో మాట్లాడుతూ, కేటీఆర్‌కు ఎటువంటి అర్హతలేదని, ఆయన తండ్రి చాటు బిడ్డ అని విమర్శించారు. రేవంత్ రెడ్డి రైతుబిడ్డగా రాజకీయాల్లోకి వచ్చి ముఖ్యమంత్రి స్థాయికి ఎదిగారని కొనియాడారు. సోనియా గాంధీ, రాహుల్ గాంధీ పేర్లను ప్రస్తావించే అర్హత కేటీఆర్‌కు లేదని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.

## అందరికీ ఫలాలు అందించేలా బడ్జెట్

తెలంగాణ బడ్జెట్ అందరికీ ప్రయోజనం చేకూరే విధంగా ఉందని కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అన్నారు. బడ్జెట్‌లో సాగునీటి రంగానికి అధిక ప్రాధాన్యత ఇచ్చామని, అందులో నల్గొండ జిల్లాకు అగ్రస్థానం ఉందని తెలిపారు. నల్గొండ జిల్లాలో ఈ రబీలో లక్ష ఎకరాల ఆయకట్టు పెరగడంతో ధాన్యం దిగుబడి పెరిగిందని ఆయన వెల్లడించారు. రైతులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా ధాన్యాన్ని కొనుగోలు చేస్తామని హామీ ఇచ్చారు. బ్రాహ్మణ వెల్లంల ప్రాజెక్టుకు బడ్జెట్‌లో నిధులను రెండింతలు పెంచారని ఆయన సంతోషం వ్యక్తం చేశారు. పాఠశాల విద్యలో భాగంగా రూ. 11 వేల కోట్ల రూపాయలతో 58 ఇంటిగ్రేటెడ్ పాఠశాలలు నిర్మిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఇందులో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల పిల్లలకు ఆరు నుంచి పన్నెండో తరగతి వరకు ఉచిత విద్యను అందిస్తామని వెల్లడించారు. 12,000 కిలోమీటర్ల రోడ్లకు వచ్చే నెల 2వ తేదీన టెండర్లు పిలుస్తున్నట్లు ఆయన చెప్పారు. కొత్త హైకోర్టు భవనం, రూ. 2,700 కోట్లతో ఉస్మానియా ఆసుపత్రి నూతన భవన నిర్మాణం జరగనున్నాయని ఆయన పేర్కొన్నారు.

# మరో 15 ఏళ్లు చంద్రబాబే సీఎం..

- ఆయన నాయకత్వంలో పనిచేయడానికి నేను ఎప్పుడూ సిద్ధమే
- విజయవాడలో ఎమ్మెల్యేల క్రీడాపోటీల ముగింపు కార్యక్రమం
- సాంస్కృతిక కార్యక్రమాలను తిలకించిన పవన్ కల్యాణ్
- అభినందనలు తెలిపిన డిప్యూటీ సీఎం
- చంద్రబాబు అనుభవాన్ని పక్కన పెట్టలేమని స్పష్టీకరణ




రాష్ట్రానికి చంద్రబాబు నాయుడు మరో 15 ఏళ్లు ముఖ్యమంత్రిగా ఉండాలని కోరుకుంటున్నానని డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ పేర్కొన్నారు. శాసనసభ్యుల క్రీడా పోటీల ముగింపు వేడుకల్లో ఆయన మాట్లాడారు. విజయవాడలోని ఏ1 కన్వెన్షన్ సెంటర్ లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొన్న పవన్. క్రీడా స్ఫూర్తిని ప్రదర్శించిన శాసనసభ్యులను, సాంస్కృతిక కార్యక్రమాల్లో విశేష ప్రతిభ కనబర్చిన వారిని అభినందించారు. మోషన్ రాజు, రఘురామకృష్ణ రాజులకు, కమిటీ సభ్యులకు, క్రీడా శాఖాధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. ఎమ్మెల్యేలు క్రికెట్, టెన్నిస్, షటిల్, వాలీబాల్, కబడ్డీ, అథ్లెటిక్స్, టగ్ ఆఫ్ వార్ వంటి క్రీడల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ క్రీడల్లో గెలుపొందిన సభ్యులందరికీ ఆయన అభినందనలు తెలియజేశారు. పార్టీలకు అతీతంగా, సీనియర్, జూనియర్ అనే తేడా లేకుండా అందరూ కలిసికట్టుగా ఉండడం సంతోషంగా ఉందన్నారు. ఆంధ్రప్రదేశ్ క్రీడా సాధికార సంస్థ చేసిన కృషిని ఆయన ప్రశంసించారు. క్రీడా మైదానంలో ఏర్పాట్లు, క్రీడా సామాగ్రి, క్రీడాకారుల సౌకర్యాల కోసం వారు చేసిన కృషి అభినందనీయమన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అనుభవాన్ని ఉపయోగించుకుని, ఆయన నాయకత్వంలో రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించాలని పవన్ కళ్యాణ్ ఆకాంక్షించారు. రాష్ట్రాన్ని గాడిలో పెట్టడానికి కనీసం 15 ఏళ్లు నిరంతరం కృషి చేయాలని ఆయన అన్నారు. చంద్రబాబు నాయుడు అనుభవాన్ని పక్కన పెట్టలేమని, ఆయన నాయకత్వంలో పనిచేయడానికి తాను ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటానని పవన్ కళ్యాణ్ స్పష్టం చేశారు. ఇంటికి వెళ్లేటప్పుడు ప్రతి ఒక్కరూ మంచి అనుభవాలను తీసుకెళ్లాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు.

# మావోయిస్టులకు మరోసారి భారీ ఎదురుదెబ్బ

- ఛత్తీస్‌గఢ్‌లో భద్రతా బలగాలు, మావోయిస్టులకు మధ్య ఎదురుకాల్పులు
- బీజాపూర్, కాంకెర్ జిల్లాలో రెండు ఎన్‌కౌంటర్లలో 30 మంది మావోల హతం
- నక్సలైట్ల దాడిలో ఓ జవాను మృతి
- ఘటనాస్థలి నుంచి తుపాకులు, భారీగా పేలుడు పదార్థాల స్వాధీనం




ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని బీజాపూర్ – దంతేవాడ జిల్లా సరహిద్దులో జరిగిన ఎన్‌కౌంటర్‌లో 30 మంది మావోయిస్టులు మృతి చెందారు. బీజాపూర్ – దంతేవాడ జిల్లా సరిహద్దులోని గంగలూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో మావోయిస్టు వ్యతిరేక ఆపరేషన్‌కు జాయింట్ టీమ్ బయలుదేరింది. ఆపరేషన్ సమయంలో భద్రతబలగాలకు మావోయిస్టులు ఎదురుపడ్డారు. దీంతో గురువారం ఉదయం 7 గంటల నుంచి మావోయిస్టులు, భద్రతా దళాల మధ్య నిరంతర కాల్పులు జరిగాయి. ఈ కాల్పుల్లో 30 మంది మావోయిస్టులు మరణించగా.. ఘటనస్థలంలో భారీగా ఆయుధాలు లభ్యమయ్యాయి. ఎన్‌కౌంటర్ స్థలం నుంచి భారీ మొత్తంలో ఆటోమేటిక్ ఆయుధాలు, మందుగుండు సామగ్రితో పాటు పద్దెనిమిది మంది నక్సలైట్ల మృతదేహాలను స్వాధీనం చేసుకున్నారు. అలాగే బీజాపూర్ డీఆర్జీకి చెందిన ఒక సైనికుడు ఎన్‌కౌంటర్‌లో వీరమరణం పొందాడు. ఘటనా స్థలంలో ఎన్‌కౌంటర్, సోదాలు ఇంకా కొనసాగుతున్నాయి. ఇక. వరుస ఎన్‌కౌంటర్లతో మావోయిస్టులకు కోలుకోలేని దెబ్బతగులుతోంది. ఆపరేషన్ ఖగార్ పేరుతో మావోయిస్టు పార్టీని పూర్తిగా నిర్మూలించేందుకు చేపట్టిన ఆపరేషన్ దూకుడుగా కొనసాగుతోంది. గురువారం బీజాపూర్‌లో అతిభారీ ఎన్‌కౌంటర్ జరిగింది. ఇప్పటి వరకు 30 మంది మావోలు హతమవగా. ఇంకా మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఘటనా స్థలం చుట్టూ సెర్చ్ ఆపరేషన్ కొనసాగుతోంది.

# వరుసగా 4 రోజులు బ్యాంకు సేవలు నిలిచిపోనున్నాయి!




ఈనెల 22 (నాలుగో శనివారం) 23 (ఆదివారం) 24, 25 బ్యాంకుల సమ్మె , బ్యాంక్ ఉద్యోగుల డిమాండ్ల పరిష్కారం కోసం ఇండియన్ బ్యాంక్స్ అసోసియేషన్ (ఐబి ఏ)తో జరిగిన చర్చలు విఫలమవడంతో బ్యాంక్ యూనియన్లు సమ్మెకు పిలుపునిచ్చారు. రెండు రోజుల పాటు బ్యాంకుల సమ్మెతో భారత ఆర్థిక రంగం స్తంభించిపోనుంది ఈ సమ్మెలో ప్రభుత్వ, ప్రైవేట్ రంగ బ్యాంకులతో పాటు ప్రాంతీయ, గ్రామీణ బ్యాంకు సిబ్బంది కూడా పాల్గొననున్నారు. అయితే వచ్చే వారంలో బ్యాంకుల సమ్మె అయినప్పటికీ ముందు నుంచే అంటే మార్చి 22 నుంచే బ్యాంకు సేవలు నిలిచిపోనున్నాయి. మార్చి 22న నాల్గవ శనివారం, తరువాత ఆదివారం బ్యాంకులకు సెలవులు. ఆపై మార్చి 24, 25 (సోమ, మంగళవారం) బ్యాంకుల సమ్మె నేపథ్యంలో దాదాపు నాలుగు రోజుల పాటు బ్యాంకు సేవలకు అంతరాయం కలుగనుంది.

# నేను చిరంజీవిని తండ్రిలా భావిస్తా



తన అన్నయ్య మెగాస్టార్ చిరంజీవికి యూకే పార్లమెంట్ లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డు రావడంపై ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఆనందం వ్యక్తం చేశారు. చిరంజీవిని తన జీవిత హీరోగా, మార్గదర్శిగా, తండ్రిలా భావిస్తానని పేర్కొన్నారు. సాధారణ కుటుంబం నుంచి మెగాస్టార్‌గా ఎదిగిన చిరంజీవి, స్వశక్తితో అభిమానులను అలరించారని, ఈ అవార్డుతో ఆయన కీర్తి మరింత పెరిగిందని పవన్ కళ్యాణ్ తన ఎక్స్‌లో పోస్ట్ చేశారు.